# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-06-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కొనసాగుతోన్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం.**

2. **రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ వరుసగా రెండవ ఏడాది జాతీయ స్థాయి పురస్కారాలు అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేసిన ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ .**

3. **రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయన్న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ.**

4. **యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపిన మంత్రి కొల్లు రవీంద్ర.**

==========================

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం వేదికగా జాతీయ సముద్ర ఆహార ఎగుమతుల కార్యశాల ఈరోజు నుంచి ప్రారంభం కానుంది. కేంద్ర మత్స్యశాఖ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ రోజు జరిగే ప్రారంభ సమావేశానికి కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, రాజీవ్ రంజన్ సింగ్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, చిరాగ్ పాశ్వాన్‌తో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు. సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతుల విస్తరణ, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధి, అంతర్జాతీయ ప్రమాణాలు, అంకుర సంస్థలు, ఎంఎస్‌ఎంఈల ప్రోత్సాహం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చలు జరగనున్నాయి.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు విశాఖపట్నం జిల్లాలో పర్యటిస్తారు. ఇందులో భాగంగా సముద్ర ఆహార ఎగుమతులపై జరగనున్న జాతీయ సదస్సుకు హాజరు కానున్నారు. అలాగే ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మొక్క ను నాటనున్నారు. అనంతరం మధ్యాహ్నం విశాఖ ఆర్థిక ప్రాంతం -వీఈఆర్‌పై సమీక్ష నిర్వహిస్తారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

--------------------------

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ప్రధాన పనులను పూర్తి చేసి, నార్లాపూర్ నుంచి ఉ దండాపూర్ జలాశయం వరకు కృష్ణా జలాలు చేరేలా చర్యలు చేపట్టాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిలలో ఉమ్మడి పాలమూరు జిల్లా నీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రాజెక్టుల పూర్తికి భూసేకరణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, మిగిలిన పునరావాస పనులను రెండు నుంచి మూడు నెలల్లో పూర్తి చేయాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ విమానయాన విధానం-2026కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిన్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల వివరాలను రాష్ట్ర సమాచార ప్రజా సంబందాల శాఖా మంత్రి కొలుసు పార్ధసారధి పాత్రికేయులకు వెల్లడించారు. వచ్చే నెల 1 వ తేదీ నుంచి వీబీ-జీ-రాంజీ పథకం అమలుకు ఆమోదం తెలిపిందని చెప్పారు.

---------------------------

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. "ప్రకృతి స్ఫూర్తితో.. వాతావరణం కోసం, మన భవిష్యత్తు కోసం" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రకృతిని పరిరక్షించవలసిన ఆవశ్యకత పట్ల ప్రజలలో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఐక్య రాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏటా జూన్ 5వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. అడవుల నరికివేత, వాహనాలను, ప్లాస్టిక్ ను ఎక్కువగా వినియోగించడం, పంట భూముల్లో ఎరువుల వాడకం వంటి కారణాల వల్ల వాతావరణం కలుషితమై పర్యావరణ నమతూకం దెబ్బతింటోందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ చెట్లను విరివిగా పెంచి వాహనాలను, విద్యుత్తు పరిమితంగా వినియోగించి ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని, ఈ దిశగా అందరూ కృషి చేయాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు.

---------------------------

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ సంకల్పబద్ధంగా ముందుకు రావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు పిలుపునిచ్చారు. ఈ రోజు సైకిళు ్లు, ఈ-సైకిళ్ల వినియోగాన్ని ప్రోత్సహించాలని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటాలని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కోరారు. భూమి, ప్రకృతి జీవనాధారమని పేర్కొన్న ముఖ్యమంత్రి, పర్యావరణాన్ని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పచ్చదనం పెంపుతో పాటు ఇంధన వనరులను పొదుపుగా వినియోగించడం అవసరమని చెప్పారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించి, పర్యావరణ హిత కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై నిన్న సమీక్ష నిర్వహించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్, బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆ వివరాలను పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాత్రికేయులకు వెల్లడిస్తూ,

వాయిస్ 33 సెకన్లు

---------------------------

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లోని అన్ని ఆసుపత్రుల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, నీటి సంరక్షణ, ఇంధన పొదుపు, వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని నిన్న ఒక ప్రకటనలో సూచించారు. సిబ్బంది, విద్యార్థులు, రోగులు, సందర్శకులకు మొక్కలను పంపిణీ చేయాలని కూడా సూచించారు.

---------------------------

తెలంగాణలో రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ లోని గచ్చిబౌలిలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పనులను పరిశీలించిన అనంతరం మంత్రి  నిన్న పాత్రికేయులతో  మాట్లాడారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు చేపడుతున్నామని తెలిపారు. భూముల విలువలను శాస్త్రీయ విధానంలో సవరించామని, ప్రజలపై అదనపు భారం పడకుండా నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. భూముల విలువలపై అభ్యంతరాలు, ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800 599 4788, వాట్సాప్ నంబర్ 8247619983ను సంప్రదించాలని సూచించారు.

---------------------------

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాల్లో ఈరోజు  తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు తదితర జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం  ఉందని పేర్కొంది. అలాగే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఎండల తీవ్రత కొనసాగుతోందని  మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో నిన్న  అత్యధికంగా 44.7 డిగ్రీల సెల్సియస్ గరిష్ట  ఉష్ణోగ్రత నమోదైనట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

తెలంగాణలోని పశ్చిమ, దక్షిణ జిల్లాల్లో ఈ రోజు అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం  తెలిపింది. రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది.

=====================